# ఖర్మం కొద్దీ పురుషుడు

మృగనయని -

"పక్కవాళ్లమ్మాయి పెళ్లికాకుండానే నెల తప్పిందిట!"

"ఆ అమ్మాయి తల్లి దగ్గరకి కూడా ఎవడో పెద్దమనిషి వస్తూంటాడుట".

"రాడూ మరి! వాళ్లాయన మెడికల్ రిప్రెజెంటెటివాయె! నెలకో రెణ్ణెల్లకో ఇంట్లో వాల్తాడు. అంతవరకూ మడికట్టుక్కూర్చుంటుందా యేమిటి?"

ఇలాంటి సంభాషణలేకాక, కుళాయిల దగ్గరా, బోరు పంపుల దగ్గరా దెబ్బలాటలు, అందులో ఒకళ్లు రహస్య కలాపాలు ఇంకొకళ్లు బయట పెట్టుకోవడం లాంటి అమ్మలక్కల్లో కలవని ప్రౌఢ. ఏభైళ్లు పైబడ్డా నిండు జవ్వనిలా కనుపించే విద్యావంతురాలు. ఆలోచనా విధానం అంతా సొసైటీ లేడీస్‌లాగా హయ్యర్ ప్లేన్స్‌లో వుంటుంది.

ఒకనాడు భర్త ఇంటికి రాగానే - "ఆ లేడీస్ క్లబ్బు మెంబర్ల మెడలో నవరత్నాలు పొదిగిన ఆభరణాలు లక్షల విలువ చేసేవి చూసేను. వాళ్లతో మాట్లాడేను. వాళ్ల భర్తలు కూడా మీ బోటి ఆఫీసర్లే. వాళ్లే కొనుక్కోగా లేనిది మీకేం తక్కువని నాకు అలాంటి నగలు చేయించలేదు?" అని కాస్తకోపంగానూ, కాస్త లాలనగానూ అడిగింది భర్తను.

"మృగనయనీ! నాకొచ్చే జీతం కడిగేసిన రాల్లే! అందులో అక్రమార్జన ఏమీలేదు. నీకు తెలియనిదేముంది ఇవాళ కొత్తగా అడుగుతున్నావ్?" అన్నాడు భర్త.

"మీరూ అలేగే సంపాదించండీ! అందులో తప్పేమిటి? నీతికి నిజాయితీకి కాలమా ఇది? అలాంటి వాళ్లు శ్రీకృష్ణ జన్మస్థానంలో కటకటాలు లెక్కపెడుతున్నారు. అవినీతి, అక్రమాలు చేస్తున్నవారు హాయిగా కార్లలో షికార్లు కొడుతున్నారు!"

"నేనలాంటి పని చేయలేను, సారీ." అన్నాడు భర్త.

"పుణ్యాం కొద్దీ పురుషుడు కాదు నా ఖర్మం కొద్దీ పురుషుడు. అంబేద్కరు, జస్టిస్ మహాజన్, కె.ఎమ్.మున్షీ ప్రభృతులు రాసిన రాజ్యాంగాన్ని నేను ఉల్లంఘినంటే కుదిరే కాలమా ఇది?" అని నొసలు చేత్తో కొట్టుకుంది మృగనయని.

మర్నాడు తెల్లారేసరికి పత్రికలనిండా సంచలన వార్తలు! "లేడీస్ క్లబ్ లేడీస్ ఇళ్లపై సిబిసిఐడి దాడులు. లక్షలు విలువచేసే నగలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ రసీదులు, జప్తు! ఆ లేడీస్ భర్తలు అరెస్టు!"

మృగనయని 'హమ్మయ్య!' అని శ్వాస పీల్చుకుంది. తన భర్త నిజాయితీని అభినందిస్తూ ఆయన పాదాలకు అభివాదం చేసింది.

సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856 - 1939) అనే మనస్తత్వ శాస్త్రవేత్త సైకో ఎనాలిసిస్ అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ - మనుషులలో మానసిక రుగ్మతలు ఆ వ్యక్తులకు తెలియకుండానే వారి వారి మస్తిష్కాలలో ఏర్పడతాయని అంటాడు.

మనుషులలో పూర్తిగా మతిపోయినవారు పిచ్చివారిగా పరిగణింపబడుతూ, పిచ్చాసుపత్రులలో చేర్చబడుతూంటారు. మరికొందరు చినిగిన బట్టలతో రోడ్లమీద తిరుగుతూ తమలో తాము మాట్లాడుకుంటూంటారు. అటువంటి వారినే మనం పిచ్చివాళ్లుగా పరిగణిస్తూంటాము. కాని ఫ్రాయిడ్ అన్నదేమంటే - నీతికీ నిజాయితీకి తిలోదకాలిచ్చి, నేరప్రవృత్తి కలిగి, హింస, దౌర్జన్యం హత్యలూ చేయడం లేదా చేద్దామన్న ఆలోచన రావడం, తత్ఫలితంగా అపమార్గాలు పట్టడం వంటివి కూడా మానసిక రుగ్మతలే అని నిర్ధారించాడు. పూర్తిగా మతి పోగొట్టుకున్న పిచ్చివాళ్లు, రోడ్ల మీద తిరుగుతూ తమలో తాము మాట్లాడుకుంటూ వుంటారే తప్ప వాళ్లవల్ల సమాజానికి నష్టం ఏమీలేదు. కాని నేర ప్రవృత్తి కలిగిన మానసిక రోగులవల్ల సమాజానికీ దేశానికీ ఎంతో నష్టం.

అలాగే నీకు కొత్త నగల మీద మోజు కొద్దీ మనసు చెదిరి, ఫ్రాయిడ్ చెప్పిన రుగ్మతకి గురి అయావు. అక్రమ పద్ధతుల ద్వారా డబ్బు సంపాదించమని నన్ను ప్రోత్సహించావు. అట్టివారిపై సిబిసిఐడి దండయాత్ర చేసి, వారి అక్రమార్జనను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేయగానే, నీలో ఆ మానసిక రుగ్మతపోయి మామూలు మనిషివయావు. నాకదే ఆనందం" అంటూ అమృతాంజనం రాసినట్లుగా మృగనయని తలనిమిరేడు భర్త.



ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక ఏప్రిల్ 1999